క్లుప్తంగా

వివాహానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ

శింగనమల: మండలంలోని తరిమెలకు చెందిన కుళ్లాయప్ప కూతురు రాధ వివాహానికి సోమవారం జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ మాట్లాడుతూ పేదవారికి సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. తరిమెల ఎంపీటీసీ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థ క్షేత్రంలో సోమవారం తాత్కాలిక హుండీ కానుకలను లెక్కించారు. వీటి ద్వారా దాదాపు రూ.2.79 లక్షలు వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శాశ్వత హుండీలను వచ్చే సోమవారం లెక్కిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై విచారణ



ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న డీఎస్పీ

తాడిపత్రి అర్బన్: ఈనెల 17న, 23న ఎమ్మార్పీఎస్ నాయకులపై దౌర్జన్యంతో కులం పేరుతో దూషించిన ఘటనలో నమోదైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై సోమవారం డీఎస్పీ వీఎన్‌కె చైతన్య విచారణ చేపట్టారు. ఈనెల 17న ఎమ్మార్పీఎస్ పెద్దిరాజును జేసీ అనుచరుడు పేరం రవి మరి కొందరు కలిసి బెదిరించి కులం పేరుతో దూషించారు. అలాగే ఆదివారం(ఈనెల 23న) జేసీ అనుచరులు ఎమ్మార్పీఎస్ కార్యాలయ పునాదులను పెకలించి అక్కడున్న బాల చంద్రాయుడుపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయం పునాదులను పెకలించిన స్థలాన్ని పట్టణ సీఐ ఆనందరావుతో కలిసి డీఎస్పీ పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ నాయకులతో వివరాలు సేకరించారు.

రైల్వే బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన భారీ వాహనం



బ్రిడ్జి మధ్యలో ఆగిపోయిన వాహనం

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద సోమవారం ఓ భారీ వాహనం ఇరుక్కుపోయింది. పత్తికొండ వైపు నుంచి గుత్తిలోకి వస్తున్న భారీ వాహనం బ్రిడ్జి కింద ఇరుక్కుపోయింది. లారీపై ఉన్న భారీ ఇనుప సామగ్రితో వెళ్తున్న వాహనం బ్రిడ్జి మధ్యలో ఆగిపోయింది. దాదాపు 2 గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో అక్కడికి చేరుకుని క్రేన్ల సాయంతో లారీని బయటకు తీసుకొచ్చారు.

జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జడ్జి ప్రతిభ

గుంతకల్లుటౌన్: ఫిబ్రవరి 11వ తేదీన స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఈ.ప్రతిభ పోలీసు అధికారులను కోరారు. సోమవారం సాయంత్రం కోర్టు హాల్‌లో లోక్‌అదాలత్ నిర్వహణపై పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన కేసులను సిద్ధం చేయాలని ఆమె సూచించారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, వన్‌టౌన్,టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, ఎస్ఐ గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 31వ వార్డు మస్తాన్‌పేటలో కనీస సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, నాయకులు రమేష్, తిమ్మప్ప, షాషావలి తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధిదీపాలను ఏర్పాటు చేయించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు వార్డులో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కమిషనర్ తెలిపారు.

జగనన్నతోనే ముస్లింల సంక్షేమం

● ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ గడిచిన మూడున్నరేళ్లల్లో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న లేఔట్లలో ఇంటి స్థలాలిప్పించి, సొంతిళ్లను నిర్మించివ్వాలని పలువురు కోరారు. ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హత కలిగినట్లయితే 90 రోజులలోపు ఇంటి స్థలమిచ్చి ఇంటిని మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలు చేశారన్నారు. దీంతో లక్షలాది మంది ముస్లిం విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదివి పెద్దపెద్ద కొలువులు పొందారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింల ఆర్థిక ప్రగతికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో మసీదులు, శ్మశానవాటికల అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు కేటాయించినట్లు ఆయన గుర్తు చేశారు. ముస్లింలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నకు మీ చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వార్డు కౌన్సిలర్ ఎ.అర్షియాబేగం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వార్డు ఇన్‌చార్జ్ యూనస్, రఫీక్, కౌన్సిలర్లు సుధాకర్, రవీంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప, పార్టీ సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎద్దుల శంకర్, మార్కెట్ వెంకటేష్, మాచర్ల శివ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ భీమలింగప్ప, పార్టీ మండలాధ్యక్షుడు మోహన్, మండల సచివాలయాల కన్వీనర్ గోవింద్ నాయక్, వివిధ శాఖల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవాగఢ్‌ను దర్శించుకోవడం పుణ్యఫలం



భోగ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సంజయ్

గుత్తి రూరల్: దేశంలోని 14 కోట్ల బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మించి, నడయాడిన పుణ్య ప్రదేశాన్ని సందర్శించడం పుణ్యఫలంగా భావిస్తున్నానని మహారాష్ట్ర అహార, ఔషధ శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం సేవాగఢ్ సంత్ సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబ ఆలయాలను మంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. మంత్రిని అర్చకులు, ట్రస్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు ఆలయ సంప్రదాయం ప్రకారం మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అర్చకుడు మారుతీ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి మంత్రికి స్వామి పట్టువస్త్రాలతో పాటుగా తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ఆవరణతో పాటుగా సేవాలాల్ నడయాడిన ప్రదేశాలను మంత్రి సందర్శించారు. భారీ ఎత్తున తయారు చేసిన ధ్వజ, మహారాష్ట్రలోని పోరాగఢ్ వరకూ సాగే సవాయి జెండా రథయాత్రను మంత్రి ప్రారంభించారు. ఫిబ్రవరి 12న రథయాత్ర పోరాగఢ్ చేరుతుందని మంత్రి తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవాగఢ్ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు రవీంద్ర నాయక్, రామచంద్రనాయక్, వెంకటరమణనాయక్, మహేష్ బంజారా, సురేష్‌నాయక్, గురుకుల ప్రిన్స్‌పాల్ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం సాగించండి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

గుంతకల్లు: రహదారి నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణం సాగించాలని ఉప రవాణా కమిషనర్ శివరామ్‌ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, డీఎస్పీ నర్సింగప్ప, ఎంవీఐ ఎన్వీ రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణ వీధుల్లో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిటాల శ్రీరాములు కల్యాణమండంలో శంకరానంద జూనియర్ కళాశాల విద్యార్థులు, ద్విచక్ర వాహనాల షోరూమ్ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో 20 నుంచి 30 స్పీడ్ కంటే ఎక్కువగా పోకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు విధిగా సీటు బెట్టి పెట్టుకోవాలని సూచించారు. రోడ్డుపై వెళ్తున్న సమయంలో అనుకోని ప్రమాదాలు జరిగి సమయంలో 100, 108 సమాచారం అందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగలిగితే ప్రాణదాతలు అవుతారన్నారు. సత్వర సేవలను గుర్తించి వారికి గుడ్ సమారిటన్ కింద రూ.5 వేలు నజరానాను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. ఎంవీఐ ఎన్వీ రాజాబాబు, సీఐలు రామసుబ్బయ్య, గణేష్, ఎస్ఐ నరేంద్ర, ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



నేతాజీ సుభాస్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దూదేకుల సేవా సంఘం నేతలు

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో జేవీవీ ఆధ్వర్యంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం నేతాజీ చేసిన సేవలను కొనియాడారు. జేవీవీ నాయకులు దేశాయి నాగరాజు, శ్రీధర్‌గౌడ్, నిజామ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరురోడ్డులోని దూదేకుల సేవా సంఘ కార్యాలయంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. సంఘం ప్రెసిడెంట్ నబీరసూల్, సెక్రటరీ హుస్సేన్‌పీరా, కోశాధికారి బాబాయ్య, గౌరవాధ్యక్షుడు నేతాజీ దస్తగిరి, సంజప్ప, రజాక్‌వలి, నాగపీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి, పి.ఎర్రగుడిలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు సుంకన్న, రాజ్‌కుమార్ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ ధైర్య సాహసాల గురించి వారు విద్యార్థులకు వివరించారు.

తాడిపత్రి టౌన్: స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు తిరుమల, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అపహరణ

నార్పల: బొందలవాడ గ్రామంలో సోమవారం ఏడు పశువులు అపహరణకు గురయ్యాయి. ఎస్ఐ రాఘవరెడ్డి వివరాల మేరకు..గ్రామానికి చెందిన శంకరయ్య, చిన్నయ్య, ఆదినారాయణ తమ పశువులను ఇంటి ముందు కట్టేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు 4 ఎద్దులు, 3 ఆవులను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి: నూతన పెన్నా బ్రిడ్జి సమీపంలో పేకాటాడుతున్న ఆరుగురిని సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ గౌస్ మహ్మద్ తెలిపారు. నిందితుల నుంచి రూ.2,900 నగదుతో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిరు దరహాసంలో బుగ్గ రామలింగేశ్వరుడు



బుగ్గ రామలింగేశ్వరస్వామి

తాడిపత్రి టౌన్ : స్థానిక శివాలయం వీధిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి చిరు దరహాస అలంకారంలో దర్శనమిచ్చారు. మాఘ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామికి జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శింగనమల: చిన్నజలాలపురం గ్రామ సమీపంలోని దోణ రామేశ్వరాలయంలో సోమవారం నుంచి మాఘమాసం పూజలు ప్రారంభించినట్లు అర్చకులు సుబ్బరంగయ్య తెలిపారు. ఈమాసమంతా రోజూ పూజలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

యల్లనూరు: కొడవండ్లపల్లి పెద్దమ్మ ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకొని సోమవారం తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడితోపాటు కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం చండీయాగం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినం



గుత్తిలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



తాడిపత్రి : కన్యాకా పరమేశ్వరీదేవి ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి, యువజన సంఘం ఉమ్మడి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, వాసవీ మహిళా మండలి సభ్యులు, యువజన సంఘం సభ్యులు, వేద పండితుడు వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: వాసవిమాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక వాసవీ కల్యాణమండపంలో వాసవీ క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాతకు అభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. క్లబ్ ప్రెసిడెంట్ బి.సురేష్, సభ్యులు జే. శేషయ్య, బి.ఆదిశేషయ్య, బి.నాగరాజు, బి.కిశోర్, జె.శ్రీనివాసులు, బి.సత్యనారాయణ, బి.చరణ్, వాసవి మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారు సోమవారం రాత్రి విశ్వరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీమాతను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బంగారు రథంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సురేంద్రనాథ్ అధ్వర్యంలో మహామృత్యుంజయ హోమం జరిగింది. కార్యక్రమంలో 102 మంది ఆర్యవైశ్య గోత్రవంశీయులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ మాతా ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితుడు రఘునాథ్‌శర్మ అమ్మవారిని అలంకరించిన విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వాసవీమాత మాతృ మండలి అధ్యక్షురాలు కే రాజేశ్వరి, కార్యదర్శి సీ వసంత, సభ్యులుకవిత, అనుపయ, జయలక్ష్మి, శోభ, రామసుబ్బమ్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉపేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్నుద్దేశించి మాట్లాడుతున్న రమేష్

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిర్దేశించిన సబ్‌ప్లాన్‌ను పదేళ్లపాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం పట్టణ కార్యదర్శి జగ్గిలి రమేష్ పేర్కొన్నారు. సోమవారం కేవీపీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సబ్‌ప్లాన్‌ను పదేళ్ల పాటు పొడగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. దళిత,గిరిజనులు అభివృద్ధి చెందే వరకు ఈ చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. కేవీపీఎస్ నాయకులు గంగన్న, లక్ష్మణ్ణ, చంద్రశేఖర్, పుల్లన్న, రంగప్ప, ప్రతాప్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

బుక్కరాయసముద్రం: ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో మరో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ సస్పెండ్ అయ్యాడు. వివరాలు.. నెల్లూరు జిల్లాకు చెందిన మల్లికార్జునరెడ్డితో రూ.25 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన కేసులో సీఐ రాము, రైటర్ కరీం సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఇదే కేసులో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేష్ తమ సీఐ చెప్పాడంటూ రూ.25 వేలు ఇవ్వాలని మల్లికార్జునరెడ్డిని అడిగినట్లు ఏసీబీ విచారణలో తేలింది. ఈమేరకు ఏసీబీ అధికారులు నివేదికను జిల్లా పోలీసు అధికారులకు పంపారు. దీంతో వారు వెంకటేష్‌ను సస్పెండ్ చేశారు.

జాతీయ బాలికా దినోత్సవం

గుంతకల్లు రూరల్: మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కసాపురం, దోసలుడుకి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా ఆడపిల్లలను బాగా చదివించాలని, ఆ చదువే వారిని రక్షిస్తుందని తెలియజేశారు. అనంతరం ఆమె గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి

గుంతకల్లు రూరల్: పట్టణంలో ఇళ్లు లేక అవస్థలు పడుతున్న దివ్యాంగులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. సమితి నాయకులు లింగమూర్తి, సురేంద్ర, మస్తానయ్య పాల్గొన్నారు.

బంగారు కిరీటం వితరణ



బంగారు కిరీటం అందజేస్తున్న చెదుళ్ల ఆనంద్, కుటుంబ సభ్యులు

యాడికి: స్థానిక లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామికి విశ్రాంత ఏసీబీ సూపరింటెండెంట్ చెదుళ్ల ఆనంద్, పద్మావతి దంపతులు వారి కుమారులు ప్రవీణ్ కుమార్, శ్రీధర్, కిరణ్ బంగారు కిరీటం వితరణ చేశారు. సోమవారం వారు ఆలయానికి చేరుకుని దాదాపు రూ.8 లక్షల విలువ చేసే బంగారు కిరీటాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఆలయ ఈఓ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఆలయ ధర్మకర్త రామిరెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, నాయకులు చౌదరి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

గుత్తి రూరల్: టి.కొత్తపల్లిలో ఇటీవల వి.చంద్ర అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష చెక్కును సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎన్‌సీ.రంగయ్య మృతుడి భార్య మహేశ్వరికి అందజేశారు.

బాల్య వివాహాలతో అనర్థం



మాట్లాడుతున్న రుఖియా బేగం

గుత్తి రూరల్: బాల్య వివాహాల అనర్థదాయకమని ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియా బేగం అన్నారు. సోమవారం రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్స్‌పాల్ ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ బాలాజీ, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు నాగేశ్వరి, ప్రియాంక, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

పుట్లూరు: ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన శనగలగూడూరు, వెంగన్నపల్లిలో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదు

తాడిపత్రి: దళితుల విషయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నేత పెద్దిరాజు హెచ్చరించారు. సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని నిర్మించుకుంటున్న క్రమంలో జేసీ అనుచరులు తమను బెదిరించారని, దీనిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. రెండు రోజుల క్రితం జేసీ అనుచరులు మరోసారి నిర్మాణంలోని కార్యాలయ పునాదిని జేసీబీతో తొలగించారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన దళిత కార్యకర్త బాలచంద్రాయుడుపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. దళితులపై దాడి చేస్తే జేసీకి తమ సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు. నాయకులు రవి, మనోహర్, ఆలూరు ఓబులేసు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పప్పుశనగ దిగుబడి



పంటకోత ప్రయోగాలు చేపడుతున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గడచిన రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది పప్పుశనగ దిగుబడి ఆశాజనకంగా ఉందని ఏఓ కే.స్వాతి పేర్కొన్నారు. సోమవారం కసాపురం గ్రామంలో రైతు ఆదినారాయణ పప్పుశనగ పొలంలో పంటకోత ప్రయోగాలను చేపట్టారు. ఐదడుగుల విస్తీర్ణంలో తొలగించిన పంట 4.5 కిలోల దిగుబడి వచ్చిందని, ఈ లెక్కన ఎకరాకు 4.5 క్వింటాళ్ల వరకూ దిగుబడి రావచ్చని ఏఓ తెలిపారు. పంటకోత ప్రయోగాల్లో ఆర్బీకే, రెవెన్యూ, ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

పెద్దవడుగూరు: మల్లేనిపల్లి, లక్ష్మంపల్లి పాఠశాలలను ఎంఈఓ రాముడు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు.

జేసీఎస్ మండలాధ్యక్షుడిగా బయపరెడ్డి

బుక్కరాయసముద్రం: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మండలాధ్యక్షుడిగా పసులూరు బయపరెడ్డి సోమవారం నియమితులయ్యారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని బయపరెడ్డి పేర్కొన్నారు.

భాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురం గ్రామంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న మేకల నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రోటరీపురంలో మేకల నాగరాజు కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకున్నారు. పంట రుణాలు, బయట అప్పుల వివరాలపై ఆరా తీశారు. నివేదికలు ప్రభుత్వానికి పంపి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఉద్యాన సహాయకుడు జగన్ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.